గంజాయి విక్రేత అరెస్ట్

రాంనగర్, అక్టోబర్ 6: నగరంలోని శనివారం బీట్ మార్కెట్ సమీపంలో గంజాయి విక్రేయించేందుకు వచ్చిన యువకుడిని త్రీ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పోలీస్ వాహనాన్ని చూసి, ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని నిజామాబాద్ జిల్లా ముజాహిద్‌నగర్‌కు చెందిన ఎండీ ఉస్మాన్‌ఖాన్(33)గా గుర్తించారు. అతడి నుంచి 2కిలోల 900 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కరీంనగర్‌కు చెందిన శశిప్రీతమ్ అనే యువకుడు, గంజాయి కావాలని, కోరగా, విక్రయించేందుకు వచ్చినట్లు అంగీకరించాడు. పట్టుబడిన నిందుతుడిని కోర్టులో హాజరు పరిచి నట్లు త్రీ టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు.

తండ్రి లేడనే బెంగతో కొడుకు బలవన్మరణం

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 6: నాలుగు నెలల క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా, తండ్రి లేడనే బెంగతో తీవ్ర మనస్తాపం చెందిన కొడుకు పురుగుల మందు తాగి బలవన్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కెల్లేడు గ్రామానికి చెందిన కాట వెంకటేశ్ (35) తండ్రి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన వెంకటేశ్ మద్యం సేవిస్తూ ఉండేవాడు. ఈ నెల 4వ తేదీన ఇంట్లోనే ఉన్న గడ్డి మందు తాగాడు. బంధువులు గమనించి, అతడి భార్యకు సమాచారం ఇవ్వడంతోపాటు చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున వెంకటేశ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అతడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మానకొండూర్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

9న సామూహిక అక్షరాభ్యాసాలు

చొప్పదండి, అక్టోబర్ 6 : పట్టణంలోని జ్ఞాన సరస్వతీ ఆలయంలో ఈ నెల 9న సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్మోహన్ స్వామి, శ్రీ భాష్యం నవీన్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని సూచించారు.

ఎల్లాపు సంక్షేమ సంఘ భవనంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

వైశ్యభవన్‌లో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి రజిత, నాయకులు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

- ఎల్లాపు, వైశ్యభవన్లలో ఆడిపాడిన ఆడబిడ్డలు

కమాన్ చౌరస్తా/ కొత్తపల్లి, అక్టోబర్ 6: బతుకమ్మ సంబురాలు ఐదో రోజు ఆదివారం కొనసాగాయి. ఇందులో భాగంగా ఎల్లాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చింతకుంట ఎల్లాపు భవన్‌లో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కరీంనగర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎల్లాపు మహిళలు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో వచ్చి ఆడిపాడారు. నిర్వాహకులు ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి, ఐదుగురికి ఎల్లాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వరరావు చేతుల మీదుగా చీరలను బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో నను వాల హరిప్రియ, పెంచాల రమాదేవి, లక్కాకుల ఉమారాణి, పెంచాల లావణ్య, వీర్ల ఊర్మిళ, వెలుముల ఉషారాణి, ఆది సరిత, గందె కల్పన, వీర్ల లావణ్య, ఆకుల కరుణ, వీర్ల రవీందర్‌రావు, పెంచాల కిషన్‌రావు, లక్కాకుల సురేందర్‌రావు, వీర్ల హన్మంతరావు, పెంచాల మురహరిరావు, వీరమల్ల రమణారావు, నారదాసు వసంత్‌రావు, ననువాల గిరిధర్ పాల్గొన్నారు.

వైశ్యభవన్‌లో..

నగరంలోని వైశ్యభవన్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బంగారు బతుకమ్మ సంబురాలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి రజిత హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

దుండగుడిని కఠినంగా శిక్షించాలి

తెలంగాణచౌక్, అక్టోబర్ 6: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడి చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని జిల్లా కురుమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్రె పావని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘం కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసి దుండగుడికి కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు నరసయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డైట్ చార్జీలు పెంచాలి

డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, అక్టోబర్ 6: రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. 2017నుంచి అమలవుతున్న డైట్ చార్జీలను అలాగే కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గురుకులాల్లో బడుగు, బలహీన వర్గాల పిల్లలే చదువుతారని, వారికి నాణ్యమైన పోషకాహారం అందాలంటే పెరిగిన నిత్యావసరాలకు అనుగుణంగా చార్జీలు పెంచాలని కోరగా.. భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

క్రికెట్ టోర్నీని ప్రారంభించిన ఎస్ఐ

వీణవంక, అక్టోబర్ 6: బేతిగల్ గ్రామంలో దసరా పండుగను పురస్కరించుకొని గ్రామానికి చెందిన పుల్లయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ, యువత శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలని, డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలను ఎవరైనా వినియోగించినా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

నిరుపేదకు సిలిండర్ అందజేత

గంగాధర, అక్టోబర్ 6: మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద పెద్దెల్లి రాజయ్య తనకు సిలిండర్ ఇప్పించాలని ఇటీవల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కోరాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే సిలిండర్‌ను పంపించగా, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం రాజయ్యకు సిలిండర్‌ను అందజేశారు. సిలిండర్ పంపించిన ఎమ్మెల్యేకు రాజయ్య కృతజ్ఞతలు తెలిపాడు. ఇక్కడ నాయకులు సాగి అజయ్‌రావు, దూలం వీరేశం, గడ్డం అంజయ్య, భైరెశెట్టి సంపత్, వొడ్నాల యజ్ఞేశ్, దూలం ఆంజనేయులు, దూలం శ్రీనివాస్, దూలం తిరుపతి, ఆడెపు సత్యం, పెంచాల చందు తదితరులు ఉన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

కోలాటంలో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యం

గంగాధర, అక్టోబర్ 6: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈర్ల మహిపాల్, బడికే కవిత, ఎదుల మహేశ్వరి నేతృత్వంలో మండలంలోని తాడిజెర్రిలో మహిళలకు 15 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కోలాటం శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సత్యం మాట్లాడుతూ, ప్రభుత్వం ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో కళాకారులకు అవకాశం కల్పించి, ఉపాధి పొందేలా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితాశ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు, నాయకులు పురుమల్ల మనోహర్, మ్యాకల ఎల్లయ్య, రామిడి రాజిరెడ్డి, రామిడి సురేందర్, వరాల సుధాకర్, ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

ఓటరు నమోదు పత్రాలతో ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి, తదితరులు

జమ్మికుంట, అక్టోబర్ 6: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని, నిరుద్యోగుల ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తానని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వీ నరేందర్ పేర్కొన్నారు. ఆదివారం జమ్మికుంట పట్టణంలోని సాహితీ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు పలుకాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పరిధిలోని నాలుగు ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో సొంత ఖర్చుతో యువతకు వృత్తి నైపుణ్య కేంద్రాలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఉచిత శిక్షణలతో పాటు గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అంతకుముందు ఓటు నమోదు, ఓటింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు, తిరుపతిరావు, శ్రీనివాస్, నర్సింగరావు, విజయ్, సంపత్, రాంరెడ్డి, స్వర్ణలత, తదితరులున్నారు.

భవిష్యత్తుకు ఉపయోగపడే విద్యా విధానం రావాలి

సదస్సులో పాల్గొన్న డాక్టర్ బీఎన్ రావు, తదితరులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 6 : ప్రతి ఒక్కరి భవిష్యత్తుకు ఉపయోగడే విద్యా విధానం రావాల్సిన అవసరం ఉందని డాక్టర్ బీఎన్ రావు పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ ఫిలింభవన్‌లో 'ప్రస్తుత విద్యారంగం– నిరుద్యోగ సమస్య– పరిష్కార మార్గాలు' అంశంపై డాక్టర్ బీఎన్ రావు ఫౌండేషన్ చర్చాగోష్ఠి నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఎన్ రావు మాట్లాడుతూ, ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. వ్యవసాయం, వైద్య, విద్యా రంగాల్లో ప్రోత్సహిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. వారికి ఏదైనా ఉపాధి దొరికే వరకు నిరుద్యోగ భృతి చెల్లించాలన్నారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నరేశ్ మాట్లాడుతూ, ఏయే కోర్సులు చదివితే మన భవితవ్యం ఎలా ఉంటుందో తెలుసుకోవాలన్నారు. దాసరి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ చర్చాగోష్ఠిలో శాతవాహన విశ్వవిద్యాలయం కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ హరికాంత్, న్యాయవాది ఎండీ జమాలొద్దీన్, న్యాయవాది టి.రఘువీర్, అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఇన్‌చార్జి బి. శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘ నేతలు తిరుపతి రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికి.. కలప తరలింపు

వీణవంక, అక్టోబర్ 6: ఊరి చెరువు కట్టపై ఉన్న చెట్లను నరికి వేసి, కలపను తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్న ఘటన బేతిగల్ గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని బేతిగల్ గ్రామ చెరువు కట్టను ఆనుకొని ఉన్న చెట్లను కొందరు అక్రమంగా నరికివేసి, శనివారం రాత్రి ట్రాక్టర్‌లో తరలించారు. అదే క్రమంలో ఆదివారం ఉదయం సైతం చెట్లను నరికి కలపను ట్రాక్టర్‌లో లోడ్ చేసి, తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని, ఆందోళనకు దిగారు. అదే సమయంలో ఇరిగేషన్ లష్కర్‌లు రావడంతో అక్రమార్కులు కలపను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఓ వైపు మొక్కలు నాటిస్తూ పర్యావరణాన్ని రక్షించాలని చూస్తుంటే, గ్రామస్థాయి అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా అక్రమార్కులకు సహకరిస్తూ సామ్ము చేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఇరిగేషన్ డీఈఈ రవీందర్ వెంటనే స్పందించారని, కలపను ట్రాక్టర్‌లో నుంచి దింపించడంతో పాటు సోమవారం క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతామని తెలిపారని గ్రామస్తులు పేర్కొన్నారు.

బేతిగల్‌లో కలపను ట్రాక్టర్‌లో లోడ్ చేసిన వ్యక్తులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, అక్టోబర్ 6: నగరంలో టవర్ నిర్మాణ పనులు, ఏబీ స్విచ్, ఇతర పనులు చేపడుతున్నందున సోమవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, 2 ఏడీ ఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల వరకు అభయాంజనేయ స్వామి గుడి ఏరియా, బ్యాంక్ కాలనీలో కొంత ప్రాంతం, రెడ్డి ఫంక్షన్ హాల్ ఏరియా, సుభాష్ నగర్ రోడ్, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు రామచంద్రాపూర్ కాలనీ, ఏపోస్ కాలనీ, గోదాం గడ్డ, శ్రీనగర్ కాలనీ, భగత్ నగర్, సప్తగిరి కాలనీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. అలాగే, కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలో టవర్ నిర్మాణ పనులు చేపడుతున్నందున సోమవారం మధ్యాహ్నం 12నుంచి సాయంత్రం 4గంటల వరకు నగునూరు, ఆర్న కొండ, రుక్మాపూర్, కాట్నపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

నవాబుపేట ఎల్లమ్మ గుడిలో చోరీ

చిగురుమామిడి, అక్టోబర్ 6: నవాబుపేట గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శనివారం రాత్రి గుడి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి, ఆలయంలోనికి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన వరకోలు సమ్మయ్య, ఆలయ తాళం తీసి ఉండడం గమనించి గౌడ సంఘం అధ్యక్షుడు బత్తిని మల్లేశంకు సమాచారం అందించారు. ఆయన పోలీసులకు సమాచారం అందించగా, వచ్చి పరిశీలించారు. సుమారు లక్షా 50 వేల విలువైన బంగారు, వెండి ఆభరణాలు చోరీ అయినట్లు అధ్యక్షుడు మల్లేశం తెలిపారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించాలి

హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 6: ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించే కోనోకార్పస్ చెట్లని తొలగించి పర్యావరణాన్ని కాపాడాలంటూ ఆదివారం పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో వివిధ ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కోనోకార్పస్ మొక్కల వల్ల శ్వాసకోశ వ్యాధులు, చర్మ సంబంధ ఎలర్జీలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంతడుపుల బాబు, జేరిపోతుల మహేందర్, మాడుగుల ఓదెలు, రుద్రారపు రామచంద్రం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, నమిండ్ల రవీందర్, తిప్పారపు భువనచంద్ర, మోరే సతీశ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో ఘన్ముక్లవాసికి రజతం

వీణవంక, అక్టోబర్ 6: పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో మండలంలోని ఘన్ముక్ల గ్రామానికి చెందిన సరిత–రాజేందర్ దంపతుల కూతురు కాయిత లక్ష్మీప్రియ సత్తా చాటింది. నారాయణపేట జిల్లా ధన్వాడలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో 17 సంవత్సరాల్లోపు బాలికల 53 కేజీల విభాగంలో ఆమె పాల్గొని ప్రతిభ చూపి రజత పతకం గెలుచుకుంది. లక్ష్మీప్రియ సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో రెజ్లింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నది. గతేడాది హనుమకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 15 రెజ్లింగ్ చాంపియన్ షిప్‌లో సైతం రజత పతకం గెలుచుకుంది. ఈ సందర్భంగా లక్ష్మీప్రియను పాఠశాల ప్రిన్సిపాల్ జయలక్ష్మి, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంఏ హఫీజ్‌ఖాన్, మహ్మద్ కరీం, కోచ్ ప్రియాంక అభినందించారు.

కుక్కల బెడద తొలగించాలి

గన్నేరువరం, అక్టోబర్ 6: మండలంలో కుక్కల బెడద తొలగించాలని తెలంగాణ రైతు హక్కుల సాధనా సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లెల జగన్ మోహన్ అధికారులను కోరారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల్లో కుక్కల బెడదతో విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

మానసాదేవి ఆలయానికి విరాళం

గన్నేరువరం, అక్టోబర్ 6: ఖాసీంపేట మానసాదేవి ఆలయానికి రామడుగు మండలం వెల్ది గ్రామానికి చెందిన అభిషేక్, రమ్య దంపతులు రూ.83,301 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లయ్య

సత్తు మల్లయ్య

చొప్పదండి/కొత్తపల్లి, అక్టోబర్ 6: కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చొప్పదండి మండలం కొలిమికుంట గ్రామానికి చెందిన సత్తు మల్లయ్యను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ బీ వెంకటేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్తు మల్లయ్య ప్రస్తుతం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. అలాగే ఆదిలాబాద్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య శ్రీమతి ప్రభుత్వ ఉపాధ్యాయినిగా పనిచేస్తుండగా, ఇద్దరు పిల్లలున్నారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మండలంలోని మంగళపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి ఉద్యమనేత ఏనుగు రవీందర్ రెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పని చేశారు. చొప్పదండి మండలానికి రెండు ప్రభుత్వాల్లో జిల్లా పదవులు రావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సత్తు మల్లయ్య నియామకంపై కొలిమికుంట మాజీ సర్పంచ్ తాళపల్లి సుజాత–శ్రీనివాస్ గౌడ్, గ్రామస్తులు హర్షం ప్రకటించారు.

ఖాదీ వస్త్రాల కొనుగోలుపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, అక్టోబర్ 6: దసరా, దీపావళి, కార్తీక పౌర్ణమి పండుగల సందర్భంగా కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో వచ్చే నెల 16 వరకు వరకు ఖాదీ వస్త్రాలు 40శాతం ప్రత్యేక తగ్గింపు ధరకు లభిస్తాయని సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ వీ భిక్షపతి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని వారు కోరారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించొద్దు

కలెక్టరేట్, అక్టోబర్ 6: రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తున్నామంటూ చెప్పుకొనే కాంగ్రెస్ ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగించొద్దని మానవ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి డా.వినోద్ సూచించారు. ఆదివారం నగరంలోని అలకాపురిలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ప్రజాస్వామ్య పునరుద్ధరణ, భావ ప్రకటన స్వేచ్ఛను ఏడో హామీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు విస్మరించి ప్రశ్నించిన వారిని అణచేసే దిశగా కాంగ్రెస్ పాలన సాగుతున్నదని విమర్శించారు. సభలు, సమావేశాలు, నిరసనలకు కూడా అనుమతులివ్వకుండా ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నదని మండిపడ్డారు. శాంతియుతంగా నిరసనలు చేసిన వారిని కూడా అక్రమంగా అరెస్టు చేస్తూ, భయానక వాతావరణం సృష్టిస్తున్నదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ప్రజాపాలనపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు మెతుకు రామ్మోహన్, వి.విజయభాస్కర్, కారెంగుల వెంకటేశం, ఇప్పకాయల సాయన్న, ప్రభుదాస్, రహీమొద్దీన్, అక్బర్, రాజేందర్‌సింగ్‌తో పాటు పలు మండలాల నుంచి వచ్చిన 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ మండల, జేఏసీ అడ్‌హక్ కమిటీల ఎన్నిక

వీణవంక, అక్టోబర్ 6: తెలంగాణ రాష్ట్ర ఆటో జేఏసీ చైర్మన్ మంద రవికుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం జేఏసీ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో మండల, జేఏసీ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా రెడ్డిరాజుల రవి, ఉపాధ్యక్షులుగా మంతెన సాగర్, ఎండీ కమ్రెద్దిన్, ప్రధానకార్యదర్శిగా రాపర్తి రవి, సహాయకార్యదర్శులుగా రాచపల్లి ఆంజనేయులు, ఎలవేని సమ్మయ్య, కోశాధికారిగా వంగ రమేశ్, ప్రచార కార్యదర్శులుగా సల్పల సమ్మయ్య, సుంక శ్రీనివాస్, జేఏసీ అడ్‌హక్ కమిటీ సభ్యులుగా దూడం సదానందం, మోటం కుమార్, పూసాల సంపత్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేఏసీ అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడు మద్దెల రాజేందర్, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, అధ్యక్షుడు అంతగిరి సంపత్, సభ్యులు మద్దుల రాంగోపాల్‌రెడ్డి, నాగుల మహేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఒకరి అరెస్టు

రాంనగర్, అక్టోబర్ 6: జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన బస్సుపైకి ఎక్కిన వ్యక్తిని డ్రైవర్ మందలించి, కిందికి దింపగా, అతడిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి డ్రైవర్ సురేశ్ బస్సు పార్కింగ్ చేయగా, సిద్ధూ అనే వ్యక్తి బస్సు టాప్‌పైకి ఎక్కాడు. సురేశ్ అతడిని మందలించి, కిందికి దింపడంతో వెంట తెచ్చుకున్న కత్తితో దాడి చేయగా, సహచర ఆర్టీసీ సిబ్బంది సురేశ్‌ను కాపాడి, సిద్ధూను అదుపులోకి తీసుకొని, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న పోలీసులు సిద్ధూను అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీసీ కంట్రోలర్ శ్రీనివాస్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచినట్లు వన్ టౌన్ సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

గంగిపల్లిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

మానకొండూర్ రూరల్, అక్టోబర్ 6: గంగిపల్లిలో ఆదివారం గ్రామ యాదవ సంఘం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలను గుర్తించి, వారిని సన్మానించిన యూత్ సభ్యులను మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ప్రతినిధులు అభినందించారు.

బుజూనూర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ఇల్లందకుంట, అక్టోబర్ 6: బుజూనూర్ గ్రామ చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ చెప్పారు. చామనచాయ రంగులో ఉన్న సదరు వ్యక్తి, 35 నుంచి 45 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, కుడి చేతికి స్టీల్ కడెం ఉందని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే ఇల్లందకుంట పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

వైష్ణవీ అలంకరణలో దుర్గాదేవి